# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్, ఇటలీ దేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా ఉన్నతీకరించుకోవాలని నిర్ణయించాయి.
- నీట్-యూజీ పునఃపరీక్షకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధికారులను ఆదేశించారు.
- సరుకు రవాణా భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఎలక్ట్రిక్ ట్రక్కులు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్రమంత్రి హెచ్.డీ. కుమారస్వామి తెలిపారు.
- డ్రోన్ల ద్వారా ప్రయోగించే గైడెడ్ మిసైల్ (ULPGM)-V3ను కర్నూలు సమీపంలోని డీఆర్డీఓ పరీక్షా కేంద్రంలో విజయవంతంగా పరీక్షించారు.

========================

ఇటలీలో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు రోమ్ నగరంలో ఆ దేశ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. అనంతరం నిర్వహించిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ఇరువురు నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్-ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలను `ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం`గా ఉన్నతీకరించాలని నిర్ణయించినట్లు నరేంద్ర మోదీ ప్రకటించారు. భారత్ - ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 2025-2029 ద్వైపాక్షిక సంబంధాలకు భవిష్యత్ ప్రణాళికతో కూడిన ఒక పటిష్టమైన చట్రాన్ని అందిస్తుందని చెప్పారు. భారత్-ఇటలీ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇరు దేశాలు షిప్పింగ్, ఓడరేవుల ఆధునీకరణ, లాజిస్టిక్స్, బ్లూ ఎకానమీపై కలిసి పని చేస్తాయని అన్నారు. ప్రపంచ సవాళ్లు, భద్రతా సమస్యలపై సహకారాన్ని పెంపొందించుకుంటూనే.. దౌత్య, ఆర్థికపరమైన సంబంధాలను మరింతగా బలోపేతం చేయడానికి ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్-యూజీ పునఃపరీక్షను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదేశించారు. న్యూఢిల్లీలో ఈరోజు కేంద్ర భద్రతా, నిఘా సంస్థలతో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అనామక ఆన్‌లైన్ గ్రూపుల ద్వారా పోటీ పరీక్షలకు సంబంధించిన తప్పుడు సమాచారం పెరిగిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న ఛానెళ్లను ముందుగానే గుర్తించి, తొలగించడంతో సహా అటువంటి నెట్‌వర్క్‌లపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు  తీసుకోవాలని ఆదేశించారు. తప్పుడు సమాచారాన్ని వేగంగా అరికట్టడానికి, పరీక్షా వ్యవస్థ సమగ్రతను కాపాడటానికి సామాజిక మాధ్యమాలు విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ పరీక్షల ఏజెన్సీలు సమన్వయంతో పని చేయాలని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సాంకేతికత, డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లతో హిందీ వినియోగం విస్తరించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు మంత్రిత్వ శాఖకు చెందిన `హిందీ సలహా కమిటీ` సమావేశానికి ఆయన అధ్యక్షత వహిస్తూ.. మంత్రిత్వ శాఖకు సంబంధించిన దాదాపు అన్ని పనులను అందరికీ అందుబాటులో ఉండే హిందీలో నిర్వహించేలా చూడటమే తమ ప్రయత్నమని తెలిపారు. హిందీ అనేది కేవలం ఒక భాషగా మాత్రమే కాకుండా దేశాన్ని ఏకం చేసే ఒక శక్తివంతమైన మాధ్యమంగా చూడాలని కోరారు. హిందీని కష్టమైన భాషగా భావించకుండా... సామాన్య ప్రజలకు అర్థమయ్యే సరళమైన భాషలో ఉపయోగించాలన్నారు. దేశంలోని ఇతర భాషలను గౌరవిస్తూనే... హిందీని ఒక అనుసంధాన భాషగా ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని గడ్కరీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఈ-బస్సులు, ఈ-ట్రక్కుల వినియోగాన్ని వేగవంతం చేసేందుకు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్. డి. కుమారస్వామి అధ్యక్షతన ఉన్నత స్థాయి సంప్రదింపుల సమావేశం న్యూఢిల్లీ వేదికగా ఈరోజు జరిగింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ ఈవీ ఎకో సిస్టమ్ లో పాలుపంచుకుంటున్న ఫ్లీట్ ఆపరేటర్లు, అగ్రిగేటర్లు, రవాణా రంగ ప్రముఖులు, ఆర్థిక సంస్థలు, పరిశ్రమ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ... దేశంలో ప్రయాణీకుల రవాణాకు ఎలక్ట్రిక్ బస్సులు భవిష్యత్ వెన్నెముకగా మారనున్నాయని చెప్పారు. అదే విధంగా సుస్థిర లాజిస్టిక్స్, సరుకు రవాణా భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఎలక్ట్రిక్ ట్రక్కులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భారతదేశపు తదుపరి దశ హరిత రవాణా పరివర్తనకు నాయకత్వం వహించాలని భాగస్వాములకు కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో మైలురాయి సాధించింది. డ్రోన్ల ద్వారా ప్రయోగించే గైడెడ్ మిసైల్ (యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ (ULPGM)-V3ను కర్నూలు సమీపంలోని తన పరీక్షా కేంద్రంలో డీఆర్డీఓ ఈరోజు విజయవంతంగా పరీక్షించింది. ఈ మిస్సైల్ భూమిపై ఉన్న శత్రువుల యుద్ధ ట్యాంకులు, వాహనాలతో పాటు.. గగనతలంలో శత్రు డ్రోన్లను, హెలికాప్టర్లను సైతం ధ్వంసం చేయగలదు. ఈ క్షిపణి అభివృద్ధిలో హైదరాబాద్‌లోని రిసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ), డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డీఆర్‌డీఎల్), చండీగఢ్‌లోని టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (టీబీఆర్ఎల్), పుణెలోని హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ కీలకపాత్ర పోషించాయి. ఈ క్షిపణి పరీక్షలు విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ... ఆయా సంస్థలను

అభినందించారు. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దిశగా సాధించిన ఒక వ్యూహాత్మక మైలురాయిగా దీనిని అభివర్ణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళలు, పిల్లలు, యువతీయువకుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ప్రపంచ మార్గదర్శకాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పునరుద్ఘాటించారు. జెనీవాలో జరుగుతున్న 79వ వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాతా నవజాత శిశు, బాలల ఆరోగ్య భాగస్వామ్యం (PMNCH) బోర్డు ఛైర్ హెలెన్ క్లార్క్‌తో జే.పీ.నడ్డా ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. బోర్డు వైస్ ఛైర్‌గా ఉన్న ఆయన PMNCHలో భారతదేశపు నాయకత్వ పాత్రను ఈ సమావేశంలో ప్రస్తావించారు. కౌమారదశలో ఉన్నవారి కోసం 2014లోనే ఒక ప్రత్యేక జాతీయ కార్యక్రమాన్ని భారత్ ప్రారంభించిందని గుర్తు చేశారు. ప్రపంచ పోకడలను అధిగమించే వేగంతో మాతా శిశు మరణాల రేటులో దేశం గణనీయమైన తగ్గింపును సాధించిందని మంత్రి పేర్కొన్నారు. అంతకుముందు వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో ప్రజారోగ్య సంరక్షణకు భారత్ అమలు చేస్తున్న పలు కార్యక్రమాల గురించి మాట్లాడుతూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య, మధ్య భారతదేశంలో రానున్న వారం రోజుల పాటూ వడగాలుల పరిస్థితులు నెలకొంటాయని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అదే విధంగా తూర్పు భారతదేశంలో రాబోయే 5 రోజులు ఇవే పరిస్థితులు కొనసాగుతాయని వెల్లడించింది. రేపటి వాతావరణ అంచనా వివరాలను IMD శాస్త్రవేత్త అమిత్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది. టాస్ గెలిచిన కోల్‌కతా ఫీల్డింగ్ ఎంచుకోగా... బ్యాటింగ్ ప్రారంభించిన ముంబై ఇండియన్స్ 8 ఓవర్లు పూర్తయ్యే సరికి 4 వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసింది. ఇదిలా ఉండగా ఐపీఎల్ సెమీ ఫైనల్స్‌కు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ఇప్పటికే అర్హత సాధించాయి. మిగిలిన ఒక స్థానం కోసం రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 75 వేల 200 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 118 పాయింట్ల లాభంతో 75 వేల 318 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 41 పాయింట్లు లాభపడి 23 వేల 659 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96 రూపాయల 83 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 109 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 491 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =